# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 111 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

27-02-2026 శుక్రవారం వెల : 1/- పేజీలు : 4


## అధైర్య పడొద్దు..
# అండగా ఉన్నాం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.
- డయేరియ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి.
- నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి పరిస్థితులు.
- కలెక్టర్ కార్యాచరణ భేష్.
- మృతుడు సురేష్ కుటుంబానికి, ఆసుపత్రులలో రోగులను పరామర్శించిన రామ్మోహన్ నాయుడు.
- కూటమి సర్కారు తోడుగా ఉందని., ధైర్యంగా ఉండాలని అభయం.



నవతరం - శ్రీకాకుళం

అనూహ్యంగా శ్రీకాకుళం నగరాన్ని డయేరియా వ్యాధి ఇబ్బంది పెడితే.. జిల్లా యంత్రాంగం దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని.. తిరిగి నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి తీసుకువచ్చారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నాడు శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రభావిత ప్రాంతాలు అయిన మంగువారితోట దగ్గరలోని కంద్ర వీధి, ధమ్మల వీధి ప్రాంతాలలో వ్యాధి బారిన పడ్డ వారిని, ఇటీవల ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయినవారిని, అదేవిధంగా వ్యాధి కారణంగా మృత్యువాత కంద్ర వీధికి చెందిన పడ్డ సురేష్ కుటుంబాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో పాటుగా పరామర్శించారు. అనంతరం కిమ్స్, జేమ్స్, రిమ్స్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి.. వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం నగరంలో నాలుగు రోజుల క్రితం డయేరియ కేసులు నమోదు ప్రారంభం అయితే రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి.. క్షేత్ర స్థాయిలో నిరంతర పరిశీలన, సమీక్షలు చేస్తూ.. నిన్నటికే సాధారణ స్థితికి తీసుకొచ్చారని అన్నారు. తాజాగా నేడు శ్రీకాకుళం నగరంలోని ప్రభావిత ప్రాంతాల్లో తాను సైతం పర్యటించానని.. అధికార యంత్రాంగం సత్వరం -మిగతా 4లో

## పొన్నా వంతెన వద్ద
# వ్యక్తి దారుణ హత్య

- శ్రీకాకుళం వాంబేకాలనీకి చెందిన పైల మోహనరావు మృతి
- రెండు రోజులుగా ఆచూకీ లేకపోవడంతో ఆందోళనలో కుటుంబం
- తలకు బలమైన గాయం కారణమా?

4లో





## వెట్టిచాకిరీ నిర్మూలన
# సామాజిక బాధ్యత

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా 2లో



## సేవా తత్పరుడు డాక్టర్ కొంచాడ

- ఘనంగా చిన్న పిల్లల వైద్య నిపుణులు సోమేశ్వరరావు జన్మదిన వేడుకలు
- ప్రశాంతి వృద్ధజనాశ్రమ అభివృద్ధికి రూ.25 వేలు విరాళం అందజేత



2లో



## టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వెల్లువ

- మారుమూల ప్రాంతాలలో అభివృద్ధి వెలుగులు
- మంత్రి అచ్చం నాయుడు చొరవతో మూడు కోట్ల 20వేల లక్షల రూపాయలు మంజూరు
- ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- చీపుర్లపాడు వద్ద మార్కెట్ యార్డ్ మంజూరు త్వరలోనే పనులు ప్రారంభం

నవతరం టెక్కలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో మార్కెట్ కమిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తూ కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు గతంలో ఎన్నడూ లేని విధంగా ఏఎంసీల బలోపేతానికి ముందడుగు వేసి అభివృద్ధి పనులు చేపట్టారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది,ఛైర్మన్ ఛాంబర్, మీటింగ్ హాల్ నిర్మాణం నిర్మాణానికి 55లక్షలు కేటాయించగా, ప్రహరీ గోడ నిర్మాణానికి, గేట్ల ఏర్పాటుకు కోటిన్నర రూపాయలు కేటాయించారు. -మిగతా 4లో

## ప్రజల్లోకి సిద్ధాంతాలు... జనసేన సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం

- కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానం
- శ్రీకాకుళం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టిన జనసేన నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్

2లో




## పలాస ప్రజారోగ్యానికి
# శిరీషమ్మ భరోసా!

డ్రైనేజీ వ్యవస్థకు మహర్దశ పట్టిస్తూ సుడా ద్వారా 5 కోట్ల నిధులు మంజూరు

నవతరం -పలాస

పలాస నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం మరియు శ్రేయస్సే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష మరోసారి నిరూపించారు. -మిగతా 2లో






ఎడిటోరియల్

# పెత్తందారీ

'కులగోత్రాలు మలమూత్రాలు/ ఒకలాంటివే / వాటిని విసర్జిస్తేనే ఆరోగ్యం/ ఒకటి దేహానికి, మరొకటి దేశానికి' అంటాడో కవి. సాంకేతికంగా మానవుడు ఎంత అభివృద్ధి చెందుతున్నా.. మన దేశంలో ప్రత్యేకంగా కులమతాలు అడ్డు గోడల్లా నిలుస్తున్నాయి. అవి గ్రామాలను ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉన్నాయి. నిన్నటికి నిన్న నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రజక కుటుంబంపై దాడి చేసి, రెండేండ్ల పసికందును కాళ్లతో తన్ని, నేలకేసి కొట్టిచిన్నారి మరణానికి కారణమైంది అగ్రకుల పెత్తందారీతనం. ఇది ఎక్కడో రహస్యంగా జరిగిన ఘటన కాదు. వేలాది మంది భక్తుల సమక్షంలో చోటుచేసుకున్న దారుణం.ఇప్పుడు కులం ఎక్కడుంది? అనే వాళ్లకి ఈ హత్య తిరుగులేని సమాధానం. కులం పేరుతో దూషిస్తూ ఆలయప్రవేశం లేదని నిరాకరించడం, కులాన్నిబట్టి ఆలయ ప్రవేశం నిర్ణయించడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం.ఈ ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం, అగ్రకుల పెత్తందారీతనాన్ని ప్రోత్సహించడం బాధాకరం.కులవ్యవస్థ సహజ లక్షణమైన నిమ్నోన్నతాల భేదభావం మనుషులను పశుతుల్యులుగా ఎలా మార్చగలదో, మానవత్వం కన్నా కులమే విలువైనదన్న వికృత ఆలోచనలు మనుషుల బుర్రల్లో తిష్టవేస్తే ఏం జరగగలదన్న దానికి ఈ సంఘటనే తిరుగులేని ఉదాహరణ. కుమ్మెర జాతరకు లక్షలలోనే జనం వస్తారు. దేవాదాయశాఖ పరిధిలోకి ఈ గుడి వెళ్లకుండా అడ్డుకున్న పెత్తందారుల ఆధ్వర్యంలోనే గుడి నిర్వహణ ఉంది. జాతర కూడా వారే నిర్వహిస్తారు. అయితే ఇక్కడ దేనికీ చట్ట బద్ధమైన నిర్ణయాలుండవు. దేనికైనా భక్తుల నుంచి బలవంతపు వసూల్లే. 'రసీదు ఇవ్వకుండా రూ.వంద ఎందుకు చెల్లించాలి' అని ప్రశ్నించిన పాపానికి ఆ కుటుంబం భారీ మూల్యాన్నే చెల్లించుకుంది. ప్రశ్నను సహించలేని అక్కడి పెత్తందారులు ఆ చిన్నారి కుటుంబాన్ని కూలదూషణ చేయడమే కాకుండా చిత్రహింసలకు గురిచేసి, చితకబాదారు. పెత్తందారులకు కొమ్ము కాస్తున్న స్థానిక పోలీసు వ్యవస్థ చిన్నారి మరణాన్ని తొక్కిసలాట ఘటనగా చిత్రించే ప్రయత్నం చేసింది.అది కాస్త బెడిసికొట్టడంతో పాలలో తేడా వలనే పసికందు మృతిచెందని కొత్తవాదాన్ని తెరపైకి తెచ్చి వారి స్వామిభక్తిని నిరూపించుకుంది.. 'ఈ దేశంలో హింస అనేది ఒక సంఘటన కాదు. అది ఈ దేశ నిర్మాణం. కులం పేరుతో అది చట్టబద్ధమైనది' అని అంబేద్కర్ చెప్పిన మాటలు ఎంత వాస్తవమో ఈ ఘటన రుజువు చేస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడుస్తున్నా నేటికీ దాదాపు కోట్ల మంది అంటరానితనం, కులవివక్షతో అణచివేయబడుతున్నారంటే ఆ జాడ్యం దేశంలో ఎంతగా వేళ్లూనుకొని ఉందో అర్థం చేసుకోవచ్చు.ఈ వివక్షల్లో ప్రాంతాల వారీగా వాటి తీవ్రతలో కొంత తేడా వున్నప్పటికీ.. వివక్షలైతే కొనసాగుతున్నాయి. లింగ, కుల, మత, వర్ణ వివక్ష వంటివి అనేక రూపాల్లో కొనసాగుతున్నాయి. ఈ వివక్షను తొలగించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించడంతోపాటు.. ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పు తీసుకురావాలి. రాష్ట్రంలో అదీ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగితే కూడా ప్రభుత్వం మౌనం వహించడం ఆ పెత్తందారీతనాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. ఇప్పటికైనా ఇలాంటి పెత్తందారీపోకడలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. బాధితులకు తగిన న్యాయం చేయాలి.దేశం ఆధునికతను సంతరించుకునే కొద్దీ అంతరించపోవాల్సిన కులం మన రాజకీయ వ్యవస్థ పుణ్యమా అని వెర్రి తలలు వేస్తోంది. మత్రి ఊడల్లాగా వేళ్లూనుకుంటోంది. ప్రేమానురాగాలను దునుమాడుతున్నది. మానవ్వతాన్ని మంటగల్పుతోంది. కుల దురహంకార హత్యలు, కుల దూషణలు వంటి ఈ ఆకృత్యాలకు బాధ్యత ఎవరిది? ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులదే కాదు, ఈ వ్యవస్థది. నేటి ఆధునిక యుగంలో కూడా తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ సనాతన భావజాలాన్ని పెంచి పోషిస్తున్న పాలకవర్గాలది. నేడు దేశంలో మత దురహంకారం, కుల దురహంకారం మరింత పెచ్చరిల్లుతున్నాయి. భావితరాల భవిష్యత్తు మీద చావుగీతలు గీస్తున్నాయి. ఆ ఫలితమే నేటి కులరక్కసి కోరలకు చిక్కి బలైందీ చిన్నారి. దేవుళ్ల ఆధారంగా ఏర్పడిన ఏ మతమైనా ఆ పసి ప్రాణాన్ని తిరిగి తీసుకురాగలదా? దేవుని పేరు చెప్పి ఆధిపత్య పెత్తందారీ వర్గాలు చేస్తున్న ఆగడాలను, దుర్మార్గాలను రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వాలు నిలువరించాలి. 'నిమ్న జాతుల కన్నీటి నీరదములు/ పిడుగులై దేశమును కాల్చివేయునని' అని హెచ్చరించాడు.. గర్జించాడు.. శాసించాడు.. చాతుర్వర్ణ వ్యవస్థను నిలదీశాడు జాషువా. కులరక్కసిని అంతం చేయాలంటే సమాజం పిడికిళ్లు బిగించాలి.

# వెట్టిచాకిరీ నిర్మూలన సామాజిక బాధ్యత

**నవతరం - శ్రీకాకుళం**

జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), నేచర్ ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న అప్పుకు ప్రతిఫలంగా తక్కువ వేతనం లేదా అసలు వేతనం లేకుండా బలవంతంగా పనిచేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ చట్టం ప్రకారం వెట్టిచాకిరీ కింద ఉన్న పాత అప్పులన్నీ రద్దవుతాయని, బాధితులు ఆ అప్పును తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, వారి ఆస్తులు యజమాని వద్ద తనఖాలో ఉంటే వాటిని విడిపించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వెట్టిచాకిరీ చేయించుకునే యజమానులకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తారని జడ్జి హెచ్చరించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు మాట్లాడుతూ.. 1976 నిర్మూలన చట్టం దేశవ్యాప్తంగా వెట్టిచాకిరీని రద్దు చేసిందని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ముఖ్యంగా అసంఘటిత రంగాల్లోని కార్మికులు ఈ దోపిడీకి గురవుతున్నారని, వారిలో చైతన్యం తెచ్చేందుకు ఈ సంచార వాహనం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, నేచర్ ఎన్జీఓ డైరెక్టర్ ఎస్. వికాస్, ప్రతినిధులు చైతన్య, దుర్గ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి సిద్ధాంతాలు... జనసేన సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం

**నవతరం - శ్రీకాకుళం**

జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టిందని శ్రీకాకుళం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టిన జనసేన నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. నగరంలోని ఏడురోడ్ల కూడలిలో జనసేన పార్టీ నాయకులతో కలిసి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు.

ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించిందని చెప్పారు. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించిందన్నారు. మొదటి వారిని ఉద్యమిగా పిలుస్తారని, వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారని చెప్పారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారని, వీరు కేవలం సభ్యులుగానే కాకుండా పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారని, వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని తెలిపారు. కావున జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి నాయకత్వ బాధ్యతలు చేపట్టే దిశగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జనసేన నాయకులు గురుప్రసాద్, ఉదయ్, నవీన్, వెంకట్, కామేష్, చిట్టి మోహన్, జనసేన వీరమహిళ మోహనలక్ష్మీ, విష్ణుప్రియ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# పలాస ప్రజారోగ్యానికి శిరీషమ్మ భరోసా!

మొదటిపేజీ తరువాయి

దశాబ్దాలుగా పలాస-కాసీబుగ్గ జంట పట్టణాల ప్రజలను వేధిస్తున్న మురుగు కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆమె చేసిన అవిశ్రాంత పోరాటం ఫలించింది. పట్టణ డ్రైనేజీ వ్యవస్థ సమూల ప్రక్షాళనకు ఏకంగా ?5 కోట్ల రూపాయల నిధులను సాధించి, ప్రజారోగ్యంపై తనకున్న అపారమైన బాధ్యతను చాటుకున్నారు. గత కొంతకాలంగా, మురుగునీరు రోడ్లపైకి చేరడం, దుర్గంధం, దోమల బెడదతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసిన శిరీషమ్మ, ఈ సమస్యను తన భుజాలపై వేసుకున్నారు.

శాసనసభ సమావేశాల్లో పలాస ప్రజల గొంతుకై గళమెత్తారు. సంబంధిత మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ గారికి సమస్య తీవ్రతను వివరించి, తక్షణమే నిధులు మంజూరు చేయాలని గట్టిగా పట్టుబట్టారు.

ఆమె పోరాట పటిమకు స్పందించిన ప్రభుత్వం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకు సూడా (SUDA) నిధుల నుండి ?5 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో అధునాతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం జరగనుండటంతో, పట్టణ ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా మారిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

కేవలం మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తూ, ప్రజా సంక్షేమం పట్ల తనకున్న చిత్తశుద్ధిని శిరీషమ్మ నిరూపించుకున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట కోసం నిరంతరం పోరాడి, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ఆమె నాయకత్వం పలాస అభివృద్ధికి శ్రీరామరక్ష అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ నిధుల మంజూరుతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొననుందని స్పష్టమవుతోంది.

## పలాస-కాశీబుగ్గ

# ఎల్లమ్మ జాతర

### ప్రజాభిమానాల నడుమ వెంకన్న చౌదరి



**నవతరం -పలాస**

పలాస-కాశీబుగ్గ పట్టణంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జామి ఎల్లమ్మ జాతర మహోత్సవంలో నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ప్రాంగణంలో కనిపించిన భక్తి వాతావరణం, ఆయనపై పట్టణ ప్రజల్లో ఉన్న అనుబంధం ఒకే చోట ప్రతిబింబించింది. భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు కలసి ముందస్తుగా చేసిన ఏర్పాట్లు మంచి ఫలితాన్నిచ్చాయని పలాస నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి తెలిపారు. ముఖ్యంగా భద్రత, వాహనాల రాకపోకల నియంత్రణ, దర్శన క్యూ లైన్ల క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో పోలీసు శాఖ చొరవతో జాతర సాఫీగా సాగుతోందని ఇందుకు పోలీస్ శాఖవారికి నియోజకవర్గ ప్రజలు తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.

## భద్రతా భేష్

పట్టణ కార్యదర్శి సప్ప నవీన్ మాట్లాడుతూ... జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, దర్శన క్యూ లైన్లు ఏర్పాటు సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు, దర్శనాలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టామని చెప్పారు. అవసరమైన చోట్ల ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, జాతరలో సాధారణ భక్తులకు పెద్దపీట వేసేలా చర్యలు చేపట్టారని తెలియజేశారు. అధికారుల సూచనలను పాటించి సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## సమన్వయంతో పారిశుధ్యం

పలాస క్లస్టర్ బాధ్యులు గాలి కృష్ణారావు మాట్లాడుతూ... జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పట్టణ పాలక సంస్థ పారిశుధ్య విభాగం సిబ్బంది నిరంతరంగా శుభ్రత పనులు, చెత్త తొలగింపు వంటి చర్యలను కొనసాగిస్తున్నారని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక దృష్టి మున్సిపల్ సిబ్బంది పెట్టారని,ఎక్కడ అపరిశుభ్రత వాతావరణం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. భక్తులకు మునుపెన్నడూ లేనివిధంగా అల్పాహారం త్రాగునీరు ఏర్పాట్లు చెయ్యడం అభినందనీయం.

## సామాజిక స్పృహ

టీడీపీ సీనియర్ నాయకుడు మల్లిపెద్ది చిన్ని మాట్లాడుతూ... జాతరకు వచ్చే భక్తులకు సేవ చేయడం సమాజ బాధ్యత అని అన్నారు. ఈ క్రమంలో పలాస జీడిపప్పు తయారీదారుల సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు, పలాస వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అయిన శ్రీ మల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో సుమారు 6,000 మందికి అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలకు ముందుకొచ్చిన దాతలు, స్వచ్ఛంద సేవకులు, సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్లమ్మ తల్లి మహత్యం -భక్తుల విశ్వాసం

ఎల్లమ్మ తల్లి జాతర అనేది పలాస--కాశీబుగ్గ ప్రాంతంలో భక్తి, సంప్రదాయం, సామూహిక సేవ కలిసి కనిపించే ముఖ్యమైన పర్వదినంగా భక్తులు భావిస్తారు. కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, కష్టాల నుంచి విముక్తి కోసం అమ్మవారికి మొక్కులు కట్టుకుని, జాతర రోజుల్లో వాటిని తీర్చుకోవడం ఇక్కడి సంప్రదాయంగా కొనసాగుతోందని పెద్దలు చెబుతారు. అమ్మవారి జాతర రోజుల్లో పట్టణం మొత్తం భక్తి పారవశ్యంతో కలకల లాడింది అమ్మవారిని మాజీ మంత్రి గౌతు శివాజీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. చిన్నా-పెద్దా తేడా లేకుండా భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తారు. ఇలాంటి సందర్భాల్లో భక్తుల సౌకర్యార్థం భద్రత, పరిశుభ్రత, సేవా కార్యక్రమాలు శత్రుప్తిగా ఉండడం జాతర లో మరింతగా భక్తులు దర్శించుకున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సేవా తత్పరుడు డాక్టర్ కొంచాడ

**నవతరం - శ్రీకాకుళం**

తన జీవన పర్యంతం సేవా నిరతిని చాటిచెబుతున్న చిన్న పిల్లల వైద్య నిపుణులు కొంచాడ సోమేశ్వరరావు 87వ జన్మదిన వేడుకలు నగరంలో స్థానిక ప్రశాంతి వృద్ధాశ్రమంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో జన్మదిన కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి భోజనం ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమ అభివృద్ధికి 25వేల రూపాయలను ఆశ్రమ ఆర్థిక కార్యదర్శి బీఏఎల్ ప్రసాద్‌కు అందజేశారు. మానవత్వం, దాతృత్వం మూర్తీభవించిన డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. చిన్నారులు, వృద్ధులకు అండగా ఉండడంతో పాటు ఎన్నో ధార్మికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు మానవత్వపు చిరునామాగా నిలిచారని పలువురు కొనియాడారు. వాకర్స్ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ నిబద్ధత గల వైద్యునిగా నేటికీ సేవలందిస్తున్న డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు సమాజం పట్ల బాధ్యతతో నిర్వహిస్తున్న సేవా నిరతి భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సమాజం కోసం తపించే ఆయన ఎందరికో మార్గదర్శకులుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ముఖ్య సమన్వయకర్త యు.వి.రమణ, ఉరిటి కృష్ణవేణి, బూరవెల్లి ప్రియ, డి.మల్లేశ్వరప్రసాద్, ఆఫీస్ మేనేజర్ సంతోష్, పోలు మహంతి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 4000 వేల మర్రి ఊడలతో 600 ఏళ్ల తిమ్మమ్మ మర్రిమాను – శ్రీ సత్య సాయి జిల్లా



ఆంధ్రప్రదేశ్లోనిశ్రీ సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం గూటి బయలు గ్రామంలో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను ప్రపంచంలోనే అతిపెద్ద ఏకైక మర్రిచెట్టుగా గిన్నిస్ రికార్డ్ సృష్టించింది. ఇది కదిరి పట్టణానికి సుమారు 26 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

1434లో సతీ సహగమనం చేసిన తిమ్మమ్మ అనే సాధ్వి చితి నుండి ఈ చెట్టు మొలకెత్తిందని ఐదు ఎకరాలకు పైగా విస్తరించి నాలుగు వేలకు పైగా ఊడలతో 60 ఏళ్లుగా వర్ధిల్లుతోంది. 1434 లో తిమ్మమ్మ అనే మహిళ తన భర్త బాల వీరయ్య చనిపోయాక అతని చితిలో ఆత్మాహుతి చేసుకుంది. ఆమె దహన సంస్కారాలు జరిగిన చోట ఆమె ఉపయోగించిన కర్రలతో ఒకటి చిన్న మొలకగా మారి నేడు భారీ వృక్షంగా విస్తరించిందని స్థానిక పురాణం. ఈ వృక్షం సుమారు ఐదు నుండి ఎనిమిది ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో వ్యాపించి ఒక చిన్న అడవిలా కనిపిస్తుంది.

ఈ చెట్టు కింద తిమ్మమ్మకు ఒక చిన్న ఆలయం ఉంది ఇక్కడ మహాశివరాత్రి సమయంలో పెద్ద జాతర జరుగుతుంది. సంతానం లేని దంపతులు ఎక్కడ మొక్కుకుంటే పిల్లలు పుడతారని అలాగే ఈ చెట్టు ఆకులు కోయడం దోషమని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న శిలాఫలకం మీద “తిమ్మమ్మ 1394 లో శెట్టిబలిజ శెన్నాక్క వెంకటప్ప, మంగమ్మలకు జన్మించింది. 1434 లో సతీ సహగమనం చేసింది “ అని చెప్పబడింది. తిమ్మమ్మ సతీ సహగమనం చేసిన చోట మొలచబడ్డ మొక్క ఈరోజు ఇంత పెద్ద మర్రి మానుగా వృద్ధి చెందింది అని భక్తులు భావిస్తారు. ఈ తిమ్మమ్మ మర్రిమాను వృక్షంపైన ఏ పక్షి మల విసర్జన చేయదని చెబుతారు. అంతే కాకుండా, సాయంత్రం 6 గంటలకల్లా పక్షులేవి ఈ చెట్టుపై ఉండవు ప్రస్తుతం ఈ వృక్షపు మొదలవద్ద మరొక మొక్క మొదలు అయ్యింది.

## తిమ్మమ్మ చరిత్ర

బుక్కపట్నానికి చెందిన వెంకటప్ప మంగమాంబ దంపతుల కుమార్తె తిమ్మమాంబను గూటిబైలుకు చెందిన బాలవీరయ్యతో వివాహం జరిపించారు. కొంతకాలం అనంతరం వీరయ్య మరణించాడు. భర్త మరణంతో తిమ్మమాంబ సతీ సహగమనానికి సిద్ధమైంది. చితిలోకి దూకేందుకు ఎత్తుకోసం నాలుగు ఎండిన మర్రి గుంజలను (కట్టెలు) నాటారు. ఆ నాలుగింటిలో ఈశాన్య దిశలో నాటిన గుంజ చిగురించి మహా వటవృక్షంగా ఎదిగింది. ఇది 1989లో సత్యనారాయణ అరియర్స్ అనే వ్యక్తి మర్రిమాను ప్రపంచ పుటల్లో స్థానం పొందేందుకు కృషిచేసాడు. 1989లో ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిమానుగా గిన్నిస్ రికార్డు సాధించింది. తాజా సర్వేలో 6,869 ఊడలతో ఎనిమిదిన్నర ఎకరాల్లో విస్తరించి ఉందని తేలింది. మర్రిమానుకు దాదాపు 660 సంవత్సరాలు నిండాయి. మర్రిమాను కిందికి వెళ్తే.. ఏదో అరణ్యంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అడుగడుగునా ఓ ఊడ కనిపిస్తుంది. దేనికదే ఇదే చెట్టు మొదలేమో అనిపిస్తుంది. ఆకాశమంత హరిత పందిరి, భూమంతా ఆక్రమించిన వటవృక్షాన్ని చూసిన ఆశ్చర్యంలో గంటలు నిముషాల్లా గడిచిపోతాయి

## మర్రి మహావృక్షం

తిమ్మమాంబ ప్రాతివత్య మహిమకు తిమ్మమ్మ మర్రిమానుగా ప్రాచుర్యం పొందిన ఈ చెట్టును ఆమెకు ప్రతిరూపంగా చెబుతారు. 15వ శతాబ్దం ప్రథమభాగంలో భర్త బాల వీరనాయకునితో పాటు సహగమనం చేసిన తిమ్మమ్మకు స్థానికులు భక్తిభావంతో ఆలయాన్ని నిర్మించారు. తిమ్మమ్మ గంగరాజు ఆస్థానంలో గూటిబయలు సంస్థానానికి ప్రతినిధిగా ఉన్న బాల వీరనాయకుని వివాహం చేసుకుంటుంది. అప్పట్లోనే ఆమె తన సంస్థాన కార్యక్రమాలను చక్కగా నిర్వహించేది. సామాజిక సంక్షేమానికి కృషిచేసేది. అయితే కుష్టువ్యాధిగ్రస్తుడైన వీరనాయకుణ్ణి గంగరాజు వెలివేస్తాడు. అప్పుడు వూరిబయట ఉన్న తమ పశువుల పాకనే కుటీరంగా చేసుకుని భర్తకు సేవ చేస్తూ జీవిస్తుంది తిమ్మమ్మ. తన పాతివ్రత్య మహిమతో గంగరాజును శపిస్తుంది. ఫలితంగా వాళ్లా కోటను వదిలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతారు. ఆరు నుంచి ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ మర్రి వృక్షం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో నమోదైంది. రాయలసీమలో అనంతపురం జిల్లాలో నీటి కొరత ఉన్నప్పటికీ తిమ్మమ్మ మర్రిమానును ఆకాశం కనిపించనంత గుబురుగా పెరిగి పచ్చని ఆకులతో పక్షుల కిలకిల రావాలతో యాత్రికులను ఆశ్చర్యపరుస్తుంది.

మర్రిమాను 1992 లో అటవీ శాఖ ఆధీనంలోనికి తీసుకుంది మర్రిమాను అభివృద్ధిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ 304 లక్షలతో అతిథి భవనం అటవీ శాఖచే వన్యప్రాణుల సంరక్షణ పాక, 12 లక్షలతో శివఘాట్ నిర్మించారు. ఇటీవల కర్ణాటకకు చెందిన కైవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానం వారు శ్రీ వేంకటేశ్వరాలయం నిర్మాణం చేపట్టారు.




“ కావ్యసుధ “
‘వాఙ్మయ భూషణ’
“ సాహితీ శిరోమణి “
“ కవన సాగర “
‘ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్’
“ ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ “
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


# ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ – 2027

**నవతరం -శ్రీకాకుళం**

అగ్ని పథ్ పథకం నకు సంబంధించి 2027 సంవత్సరంనకు ఆసక్తి గల వివాహం కాని పురుష అభ్యర్థులు నుండి ఆన్ లైన్ లో దరఖాస్తులు కోరారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసు, విశాఖపట్నం కార్యాలయం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు సేవలు అందిస్తుందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 10వ తరగతి పాస్ మరియు అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 8వ తరగతి పాస్ వర్గాలకు దరఖాస్తులు ఆహ్వానించారు.

13 ఫిబ్రవరి 2026న జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో ప్రచురించిన ప్రస్తుత నోటిఫికేషన్‌లో పేర్కొన్న వర్గాలకు దరఖాస్తులు ఆహ్వానించబడతాయన్నారు.

అగ్నిపథ్ పథకం కింద నియామక సంవత్సరం 2027 కోసం అగ్నివీర్ నియామకం కోసం ఆన్‌లైన్ సెలెక్షన్ టెస్ట్ (CEE) కోసం నమోదు 13 ఫిబ్రవరి 2026 నుండి 01 ఏప్రిల్ 2026 వరకు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు (www.joinindianarmy.nic.in) మాత్రమే ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్‌కు అర్హులని పేర్కొన్నారు.

అగ్నివీర్‌ల నియామకం రెండు దశల్లో జరుగుతుంది:

దశ-1 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ రిటెన్ ఎక్సామ్ (ఆన్‌లైన్ జజుజు) ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ కేంద్రాలలో 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 (తాత్కాలికంగా) వరకు జరుగుతుందన్నారు.

దశ-II షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థి నిర్దేశిత రిక్రూట్‌మెంట్ ర్యాలీ వేదికలో రిక్రూట్‌మెంట్ ర్యాలీక్ స్టిపులేటెడ్ తేదీ మరియు సమయంలో హాజరు కావాలన్నారు.

# లేలేత మెరుపులతో మంత్రముగ్ధుల్ని చేస్తున్న రుక్మిణీ!



కొత్త నీరు వస్తే పాత నీరు పోతుంది అనేది ఎంత వాస్తవమో.. కొత్త హీరోయిన్లు వచ్చేసరికి పాత వాళ్ళ క్రేజ్ తగ్గుతుందనే కామెంట్లు కూడా అంతే వినిపిస్తూ ఉన్నాయి. అయితే ఈ కొత్త హీరోయిన్లు కూడా తమ లేలేత మెరుపులతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాలలోకి అడుగుపెట్టి తమ అందంతో ప్రేక్షకులలో ఒక ఉనికిని సంపాదించుకుంటూనే.. ఇంకొక వైపు నటనతో విశ్వరూపం చూపించే ప్రయత్నం చేస్తున్నారు. అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ.. ఫాలోవర్స్ ను పెంచుకుంటూ బ్రాండ్ ప్రమోటర్స్ గా కూడా మారుతున్నారు. ఇదిలా ఉండగా 2024లో నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది రుక్మిణి వసంత్. అంతకుముందు కన్నడలో నటించిన ఈమెకు మంచి గుర్తింపు లభించింది కానీ ఈ తొలి తెలుగు చిత్రంతో పెద్దగా గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ఆ తర్వాత ఏ. ఆర్. మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా మదరాసి సినిమాతో తమిళ్ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఎప్పుడైతే రిషబ్ శెట్టి తన కాంతారా చాప్టర్ 2 సినిమాలో అవకాశం కల్పించారో అప్పటినుంచి ఈమె వార్తల్లో నిలుస్తూ వచ్చింది. ఇక సినిమాలో తన అద్భుతమైన నటనతో విశ్వరూపం చూపించింది. ఈ ఒక్క సినిమాతో ఏకంగా పాన్ ఇండియా స్థాయి గుర్తింపును సొంతం చేసుకుందని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికంటే ముందే ఈమె ఎన్టీఆర్ - ప్రశాంత్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాకి కూడా సైన్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా విక్రమ్ కొడుకు ధృవ్ విక్రమ్ హీరోగా వస్తున్న సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె.. మరొకవైపు నాగచైతన్య కొత్త సినిమాలో కూడా అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో హీరో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా రుక్మిణి వసంత్ కీలకపాత్ర పోషిస్తుంది .

ఇలా భారీ ప్రాజెక్టులలో అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన రుక్మిణి మరొకవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ కు దగ్గర అయ్యే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే తాజాగా సింపుల్ లుక్ లో లేత అందాలను చూపిస్తూ అభిమానులను మెస్మరైజ్ చేసింది.

సింపుల్ అవుట్ఫిట్ తో అందాలు మొత్తాన్ని దాచేస్తూ లేత మోముతో అభిమానులను ఆకట్టుకుంది. ఇక రుక్మిణి వసంత్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా .. అమ్మడి అందానికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా రుక్మిణి వసంత్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి.

# మార్చి ఫుల్ అయిపోయింది

ఒక్క నెల వెనుక చూస్తే మార్చి నెల డైరీ అంతా ఖాళీ. . మార్చి 19 నుంచి సినిమాల తాకిడి వుంది తప్ప అంతకు ముందు లేదు..ఎగ్జామ్స్ సీజన్ కదా .అనుకోవాల్సి వచ్చింది. కానీ తీరా చూస్తే ఇప్పుడు మొత్తం నెల ఫుల్ అయిపోతోంది. వరుసగా సినిమాల మీద సినిమాల డేట్ లు పడుతున్నాయి. అన్ని రకాల ఎగ్జామ్స్ ప్రారంభం అవుతున్న ఫస్ట్ వీక్ లో రెండు మూడు సినిమాలు వస్తున్నాయి. శ్రీవిష్ణు థ్రిల్లర్ మృత్యుంజయ్ సినిమా విడుదల ఫస్ట్ వీక్ లోనే. చిన్న సినిమాలు సాంప్రదాయని సుద్ద పూసనీ..మాన్షన్ హవుస్ మల్లేష్..అప్పుడే. వరలక్ష్మీ శరత్ కుమార్ డైరక్షన్లో వస్తున్న సరస్వతి కూడా ఆ వారమే. మార్చి రెండో వారంలో కోర్ట్ సినిమాతో పాపులర్ అయిన జంటతో కోన వెంకట్ అందిస్తున్న బ్యాండ్ మేళం సినిమా విడుదల వుంది. ఆ తరువాత వారం అంటే 19న టాక్సిక్ సినిమా వుంది. దురంధర్ డేట్ కూడా అప్పుడే. 26వ తేదీన పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదల వుంది. అంటే మొత్తం నాలుగు వారాలు ఫుల్ అయిపోయాయి. ఇంకో మరో ఒకటి రెండు చిన్న సినిమాలు కూడా బరిలో దిగే అవకాశం వుంది. ఆ పైన ఎలాగూ సమ్మర్ స్టార్ట్ అయిపోతుంది. ఏప్రిల్ నుంచి ఫుల్ సినిమాలే సినిమాలు.



# ఓ అందమా...నీవెక్కడ..?



ఓ అందమా నీవెక్కడ...?
ఏడు రంగుల ఇంద్రధనుస్సు
వెలిసిన ఆకాశపు అంచులోనా...?
ఊహూ...

ఇదిగో ఈ సుందరి చీరమడతల్లో
సింగారించిన రంగవల్లిలో
నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
పురివిప్పి నాట్యమాడే
మయూరి అడుగుల
సవ్వడిలోనా...?
ఊహూ...

ఇదిగో ఈ వయ్యారి నడకలో
ఎగిసే వసంత తరంగంలా
నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
గుభాళించే ఎర్రని గులాబి
రేకుల్లోనా..?
ఊహూ...

ఇదిగో ఈ బాపుబొమ్మ నవ్వుల్లో
కురిసే పూలవానలో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
చల్లని వెన్నెలను కురిపించి
మురిపించే ఆ చందమామ
ఒడిలోనా...?
ఊహూ...

ఇదిగో ఈ అతిలోక సుందరి
ముఖాన
మెరిసే పౌర్ణమి వెలుగులో
నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
తళతళ మెరిసే తారల
బొట్టులోనా...?
ఊహూ...

ఇదిగో ఈ జవరాలి జాలిచూపులో
జ్వలించే దీపశిఖలో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
ఇదిగో ఈ సుందరి సౌందర్య
సాక్షాత్కారంలో నేనిక్కడ..!

ఈమె మెడలో మెరిసే
ముత్యాలహారంలో నేనిక్కడ..!

ఈమె హృదయంలో
పలికే మృదుమధుర
సుస్వర గీతంలో నేనిక్కడ..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# పొన్నా వంతెన వద్ద వ్యక్తి దారుణ హత్య

**(నవతరం - శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగరం వాంబేకాలనీకి చెందిన పైల మోహనరావు (48) దారుణ హత్యకు గురయ్యాడు. ఎచ్చెర్ల మండలం పొన్నా వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మోహనరావు నగరంలోని వాంబేకాలనీ రాజీవ్ గృహకల్పలో 1వ నెంబరు బ్లాక్‌లో నివాసం ఉంటున్నాడు. తన ఇంటి వద్ద టిఫిన్, కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కొంత నగదును వడ్డీలకు కూడా ఇస్తున్నట్లు సమాచారం.
గత రెండు రోజులుగా మోహనరావు ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీస్తున్నారు. గురువారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో పొన్నా వంతెన సమీపానికి వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.
మోహనరావు తల నుంచి రక్తం కారుతున్న ఆనవాళ్లు కనిపించడంతో తలకు తగిలిన బలమైన గాయం కారణంగా మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. హత్యకు గల కారణాలు, పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా కానూరు నారాయణరావు



**నవతరం-లావేరు**
జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా కానూరి నారాయణరావు విజయవాడ కేంద్ర కార్యాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ ఉన్నమ్ జ్ఞానసుందరి గారి ఆధ్వర్యంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు మాట్లాడుతూ నాకు అప్పచెప్పిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహించి ప్రజా సమస్యల పట్ల దృష్టి సారించి సంఘానికి మరియు సమాజానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ పెద్దలు పిళ్ళా కన్నన్నాయుడు దామోదర్ తదితరులు ఉన్నారు.

# స్వయం ఉపాధితోనే ఆర్థిక పురోగతి

## ఎచ్చెర్ల ఆర్‌సెటీలో శిక్షణా తరగతులు ప్రారంభం




**నవతరం-ఎచ్చెర్ల**

నిరుద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని సొంతంగా ఎదిగేందుకు కృషి చేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పెడాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం లబ్ధిదారులకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 లక్షల లోపు రుణాలు పొందిన వారికి ఐదు రోజులు, అంతకంటే ఎక్కువ రుణం తీసుకున్న వారికి పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయ్యాక ఇచ్చే ధృవీకరణ పత్రాలను సంబంధిత బ్యాంకుల్లో సమర్పించాల్సి ఉంటుందని, ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే తదుపరి విడతలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

### మహిళా దినోత్సవం నాటికి యూనిట్ల స్థాపన

మహిళా లబ్ధిదారులందరూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమ ఉపాధి యూనిట్లను ప్రారంభించి ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ ఆకాంక్షించారు. మార్చి 8వ తేదీ లోపు లబ్ధిదారులందరూ తమ యూనిట్లను గ్రౌండింగ్ చేసి సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రెండో విడతగా ఈ శిక్షణ జరుగుతోందని సంస్థ డైరెక్టర్ రాంజీ తెలపగా, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. లబ్ధిదారులు వ్యాపార మెళకువలు నేర్చుకుని అభ్యున్నతి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.

# గుంటూరు కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు



గుంటూరు నల్లపాడు పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నందు వివిధ సబ్జెక్టులకు సంబంధించి టీచర్ పోస్టులకు కాంట్రాక్టు పద్దతిలో 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొంత శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 న ప్రైమరీ టీచర్స్, బాలవాటిక, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్, నర్సు, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, తెలుగు టీచర్స్ కు మార్చి 2 న పీజీటీ ఇంగ్లీష్, హిందీ, బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ మరియు టీజీటీ ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, సోషల్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూ కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇతర వివరాలకు పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వెబ్సైట్ https://guntur.kvs.ac.in/ ను సందర్శించాలన్నారు.

# అధైర్య పడొద్దు.. అండగా ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

స్పందించారని తెలిపారు. డయేరియా కారణంగా మృతి చెందిన సురేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని ధైర్యాన్ని ఇచ్చినట్టు స్పష్టం చేశారు. ప్రస్తుతానికి జెమ్స్, కిమ్స్, రిమ్స్, జి.జి.హెచ్ ఆసుపత్రులలో నిన్నటికి 124 కేసులు ఉండగా.. అందులో ఇరవై రెండు డిశ్చార్జి కావడంతో 102 కేసులు ఉన్నాయని అన్నారు. ఇందులో కొన్ని మాత్రమే ఇబ్బంది ఉండగా.. మిగిలిన వారి పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. తొలి కేసు నమోదు అయిన నాటి నుండే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సత్వరం స్పందించారని.. క్షేత్ర స్థాయిలో పర్యటనలు జరిపి.. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని అన్నారు.
డయేరియా తరహాలో చిన్న ఇబ్బంది ఉన్నా.. వారికి ఆసుపత్రులలో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. మంచినీటి సమస్యపై ఇప్పటికే శాంపిల్ లను కూడా తీసుకుని పరిక్షల కోసం పంపించామని.. ఫుడ్ ద్వారా ఇబ్బంది జరిగిందా అన్న కోణంలో కూడా విశ్లేషణ జరుపుతున్నారని అన్నారు. అన్ని దిశల్లో దర్యాప్తు చేసి.. వ్యాధి ఉధృతికి గల ఆసలు కారణాన్ని తెలియపరుస్తామని అన్నారు. ఇంకోవైపు నగరంలో మంచినీటి సరఫరాపై కూడా మంత్రి నారాయణ క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి పూర్తి పరిశీలన చేశారని అన్నారు. ఆయన పలు సూచనలు చెయ్యగా.. ఆ దిశగా అభివృద్ధి పనులు కూడా కార్యరూపం దాల్చాయని అన్నారు. గతంలో కార్పోరేషన్ ను సిండికేట్ గా మారి దగా పరిచారని.. వాటికి స్వస్తి పలుకుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్వచ్ఛాంధ్ర పిలుపుతో శానిటేషన్, ఇతర శుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని.. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. మంత్రి నారాయణ తెలిపిన మేరకు సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ద్వారా కార్పోరేషన్ అభివృద్ధి దిశగా సమూల మార్పులు చేస్తూ అభివృద్ధికి పథకరచన చేశామనియా అన్నారు. సుడా ద్వారా మరో 12కోట్ల రూపాయల ద్వారా డ్రేయిన్లను ఆధునీకరిస్తున్నామని స్పష్టం చేశారు.
ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత, జిజిహెచ్ సూపరిండెంట్ ఎల్ ప్రసన్న కుమార్, రిమ్స్ ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు, ఆర్ ఎంఓ సుభాషిని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వెల్లువ

మొదటిపేజీ తరువాయి

కార్యాలయ భవనం ఆధునికీకరణకు 25 లక్షల రూపాయలు, అలానే చీపుర్లుపాడు వద్ద మార్కెట్ యార్డు మంజూరుతో పాటూ సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి 90 లక్షలు మంజూరు చేశారు.
మొత్తం మూడు కోట్ల ఇరవై లక్షల రూపాయలు కేటాయిస్తూ.. ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది.
వీటితో త్వరలో పనులు చేపట్టి మారుమూల ప్రాంతాలకు అభివృద్ధి వెలుగులు తీసుకుని రానున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్న కృషి ఫలితంగానే నిధులు మంజూరు అయ్యాయని, ఆయన పదవి అందుకున్న నాటి నుంచి నేటి వరకూ టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు మరియు ప్రజలు తమ ఆనందం వ్యక్తం చేస్తూ ఉన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**